
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
శుక్రవారం 13 డిసెంబరు 2024



- ఏడాదిన్నరకు పైగా మందగించిన బిజినెస్
- అమ్మే వారున్నా కొనేవారు కరువు
- రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయానికి పెద్ద దెబ్బ
- ప్లాట్ల ధరలు తగ్గుతున్నా లావాదేవీలకు ముందుకురాని వైనం



రియల్ ఢమాల్



జనగామ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలవుతోంది. కొన్నాళ్లుగా జోరు మీదున్న స్థిరాస్తి రంగం నానాటికీ అధోగతికి చేరుకుంటోంది. సాధారణ స్థితికి భిన్నంగా ఏడాదిన్నరగా స్థిరాస్తి వ్యాపారం అంతగా సాగడం లేదు. అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో బిజినెస్ మందగించింది. వ్యవసాయ భూములతోపాటు వ్యవసాయేతర భూముల(ప్లాట్ల) అమ్మకాలు, కొనుగోళ్లు భారీగా తగ్గిపోయాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు వెలవెలబోయి కనిపిస్తున్నాయి. భూముల ధరలు విపరీతంగా ఉండడం, కొన్న తర్వాత మళ్లీ పెరిగే అవకాశం కనిపించకపోవడం వంటి కారణాలతో రియల్ రంగం అంతకంతకు మందగిస్తోందని ఆ రంగంలోని నిపుణులు చెబుతున్న మాట.

ఎన్నికల తర్వాత మరింత దిగజారి..

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత స్థిరాస్తి వ్యాపారం మరింత దిగజారిపోయింది. రియల్ ఎస్టేట్‌లో రాణించి రాజకీయంలో రావడమా? రాజకీయంలో వచ్చాక రియల్ ఎస్టేట్ రంగంలోకి ప్రవేశించడమో తెలియదు కానీ.. రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువగా రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతుంటుంది. రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో ఎక్కువగా రాజకీయ నాయకులే ఉంటుంటారు. మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలతో మొదలుకొని కింద స్థాయి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు భూములు కొంటుంటారు. వీరు తమ బినామీల పేరు మీద ఎక్కువగా భూములు కొనడం సహజం. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులంతా భూముల కొనుగోలుకు దూరంగా ఉన్నారు. ఎన్నికలు పూర్తయ్యాక ఎన్నికల్లో ఖర్చు భారీగా అయిందన్న కారణంగా ఇప్పటికీ రాజకీయ నాయకులు క్రయాలపై దృష్టి పెట్టడం లేదు. దీనికి తోడు ద్వితీయ శ్రేణి రాజకీయ నాయకులు సైతం రియల్ రంగంపై అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఈ శ్రేణి నాయకులు ఎక్కువగా జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతరత్రా నామినేటెడ్ పదవుల కోసం ఆశిస్తుంటారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల వచ్చే అవకాశం ఉండడంతో వారు సైతం భూముల కొనుగోలుకు ముందుకు రావడం లేదు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే రాజకీయ నాయకుడికి నగదు అతి ప్రధానం. దీంతో ప్రస్తుతం భూముల కొనుగోలు అంశాన్ని పక్కనపెట్టి నగదును సేకరించుకునే పనిలో ఉంటారు. ఇప్పుడు భూములు కొంటే తీరా ఎన్నికల నాటికి బిజినెస్ పడిపోయి ధరలు ఉండకపోతే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాజకీయ నాయకులంతా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఎగబాకి.. అంతలోనే పడిపోయి..

గడిచిన పదేళ్లలో రియల్ ఎస్టేట్ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. పదేళ్ల కిందటితో పోలిస్తే వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. 2014 తర్వాత రియల్ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. గతంలో రూ.10లక్షలకు ఎకరం ధర పలికిన భూమి ప్రస్తుతం రూ. ఒక కోటి వరకు వెళ్లింది. అదే విధంగా రూ.2000 గజం స్థలం దొరగ్గా ప్రస్తుతం రూ. 20వేలకు ఎగబాకింది. జనగామ జిల్లాలో జిల్లా ఆవిర్భావం తర్వాత రియల్ రంగం వేగంగా అభివృద్ధి చెందింది. కాగా.. ఏడాదిన్నర నుంచి నెమ్మదిగా కుదేలవడం ప్రారంభమైంది. ప్రస్తుతం బిజినెస్ డల్‌గా మారడంతో రూ. కోట్లు వెచ్చించి వెంచర్లు చేసిన వారు, భూములు కొని పెట్టుకున్న వారికి వడ్డీలు మీద పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారం అంతంగా లేకపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు వెలవెల బోతున్నాయి. జిల్లాలో 12 తహసీల్దార్ కార్యాలయాలు, జనగామ, కొడకండ్ల, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. కాగా.. వీటిలో ఏడాదిన్నరగా రిజిస్ట్రేషన్లు తక్కువగానే జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జనగామ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో రోజుకు 75 నుంచి 100 రిజిస్ట్రేషన్లు జరగగా ప్రస్తుతం రోజుకు 30 కూడా జరగడం లేదు. ఈ 30 రిజిస్ట్రేషన్లలోనూ క్రయ, విక్రయాలకు సంబంధించినవి ఐదారు డాక్యుమెంట్లు కూడా ఉండడం లేదని రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించడంతో ప్రభుత్వ ఆదాయంపై కూడా ప్రభావం పడింది. ప్రభుత్వ ఖజానాకు ఏడాదిన్నర నుంచి అంతంతగానే ఆదాయం జమ అవుతోంది.

కొనేవారి కోసం వేట

ప్రస్తుత పరిస్థితుల్లో భూములు, ప్లాట్లు అమ్మేవారు తప్ప కొనేవారు ఎవరూ లేకపోవడంతో రియల్ ఎస్టేట్ బ్రోకర్లంతా కొనేవారిని(పార్టీలను) పట్టుకొని పనిలో నిమగ్నమయ్యారు. కొనేవారు, అమ్మేవారు కాకుండా మధ్యవర్తిత్వం చేసి కమీషన్లు తీసుకునే వారు చాలా మంది ఉంటారు. అలాంటి వారికి రియల్ ఎస్టేట్ రంగమే జీవనాధారం. ప్రస్తుతం స్థిరాస్తి వ్యాపారం పడిపోవడంతో అలాంటి వారికి కమీషన్లు రావడం కూడా ఆగిపోయాయి. దీంతో వారు పొద్దున లేవగానే పార్టీలను వెతికే పనిలో నిమగ్నమవుతున్నారు. ఫలానా దగ్గర వ్యవసాయ భూమి ఉంది, ఫలానా దగ్గర ప్లాట్ ఉంది అంటూ వాట్సాప్ గ్రూపుల్లో, ఫేస్‌బుక్‌లో పోస్టు చేస్తుండడం గమనార్హం. తమకు గతంలో ఉన్న పరిచయాల ద్వారా కొనడానికి ఆస్కారం ఉన్న రాజకీయ నాయకులు, డబ్బున్న వ్యక్తులకు కాల్స్ చేస్తూ వారిని కొనేలా ఒప్పించే పనిలో ఉంటున్నారు. తక్కువలో వస్తుందంటూ, అంత మంచి భూమి మళ్లీ దొరకదంటూ కబుర్లు చెబుతూ కొనేవారికి ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పెళ్లిళ్ల కోసమో, ఆసుపత్రుల ఖర్చుల కోసమో, ఇంటి నిర్మాణం కోసమో భూమి గానీ, ప్లాట్ గానీ అమ్ముకుందామనుకుంటున్న వారికి ప్రస్తుతం చుక్కెదురు అవుతోంది. కొనేవారు ఎక్కువగా లేకపోవడంతో ముందుకొచ్చిన వ్యక్తికి ఎంతోకొంత గిట్టుబాటు చూసుకొని ఇవ్వాల్సి వస్తోంది.

దీక్షలకు ఉపాధ్యాయ సంఘాల మద్దతు



కలెక్టరేట్ ముందు నిరవధిక దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జనగామ కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు గురువారం 3వ రోజుకు చేరింది. దీక్షకు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, డీటీఎఫ్ జిల్లా బాధ్యులు ఇప్ప రాంరెడ్డి, చొక్కయ్య, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్లనాగుల రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ సమ్మె శిబిరానికి వచ్చి ఉద్యోగులకు అండగా ఉంటామని మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సురేందర్, జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేష్, కోశాధికారి గోలి రవిందర్‌రెడ్డి, శ్రీలత, ఎండబట్ల శ్రీనివాస్, అన్నపూర్ణ, రాణి, సుకన్య, రజిత, సునీత, జ్ఞానానందం, బాకీ వెంకటేశ్వర్లు, రాంచందర్ పాల్గొన్నారు.

● మూడో రోజుకు చేరిన దీక్షలు

జనగామ రూరల్: సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నివధిక దీక్ష గురువారం మూడో రోజుకు చేరింది. కలెక్టర్ వద్ద సాగుతున్న దీక్షలో ఉద్యోగులు కోట్ల శ్రీలత, భవానీలు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముదు వరంగల్ బహిరంగ సభలో కాఫీ తాగే అంతా సమయంలో తమ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి యేడాది గడుస్తున్న కూడా పరిష్కరించడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో తాడూరి రమేశ్, బైరగొని దయాకర్, గోలి రవీందర్‌రెడ్డి, గోరంట్ల యాదగిరి, వేణు, దిలీప్, మమత, రేవంతి, కరుణ పాల్గొన్నారు.

తిరిగొచ్చిన పెద్దపులి



తాడ్వాయి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోనిఏజెన్సీ వాసులకు మూడు రోజులుగా నిద్ర లేకుండా చేస్తున్న పెద్దపులి తాజాగా తాడ్వాయి మండలంలోకి ప్రవేశించింది. గురువారం పంబాపూర్ అటవీప్రాంతంలో సంచరిస్తున్నట్లు నిర్ధారణఅయింది. గ్రామానికి చెందిన ఓ గిరిజనుడు ముష్టిగింజల సేకరణ కోసం సమీప అడవికి తమ పెంపుడు కుక్కలతో కలిసి వెళ్లాడు. పులిని చూసిన కుక్కలు బిగ్గరగా అరిశాయి. భయంతో వణికిపోయిన ఆ వ్యక్తి పరుగున గ్రామానికి చేరుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అటవీ శాఖ అధికారులు అడవిలోకి వెళ్లారు. పాదముద్రల ఆధారంగా పెద్దపులి వచ్చినట్లు నిర్ధారించుకున్నారు. 2021-22 సంవత్సరంలో ఇదే అడవిలో పెద్దపులి సంచరించింది. 2021లో అనూహ్యంగా వేటగాళ్ల ఉచ్చుకు ఓ ఆడపులి బలైంది. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలోకి వెళ్లిన పులి వెనక్కివచ్చి తాడ్వాయి అడవుల్లోకి ప్రవేశించింది. ట్రాప్ కెమెరాల ద్వారా కదలికలను అధికారులు గమనిస్తున్నారు. జనావాసాల వైపునకు వచ్చే అవకాశం ఉండడంతో సమీప గ్రామాలను అటవీ అధికారులు అప్రమత్తం చేశారు. అడవి సమీపంలోని పంట పొలాల వద్దకు వెళ్లవద్దని, పశువులను మేపడానికి, అటవీ ఉత్పత్తుల కోసం అడవిలోకి వెళ్లకూడదంటూ హెచ్చరికలు జారీ చేశారు. పెద్దపులి సంచారంతో దామెరవాయి, పంబాపూర్, గొత్తికోయగూడెం వాసులు భయంతో వణికిపోతున్నారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌కు నిహారిక



తాటి నిహారిక

జనగామ కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నమెంటుకు జిల్లాకు చెందిన తాటి నిహారిక ఎంపికైంది. జిల్లా కేంద్రంలోని సాన్‌మారియా పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నిహారిక ఇటీవల కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ నెల 22న ఛత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నమెంటులో ఆమె పాల్గొంటుందని పాఠశాల డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, పీఈటీ రవికుమార్ గురువారం తెలిపారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

జనగామ రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఎంఈవోలు, వసతి గృహాల వార్డెన్‌లు, హెచ్‌ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని, స్టడీ అవర్స్‌లో అన్ని సబ్జెక్ట్‌లపై పూర్తి స్థాయిలో విద్యార్థులతో సాధన చేయించాలని సూచించారు. సబ్జెక్ట్‌లో బలహీనంగా ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 40శాతం డైట్, కాస్మోటిక్స్ చార్జీల పెంపు 14న జిల్లాలోని విద్యాసంస్థల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆదేశించారు.

విద్యాసంస్థలను పరిశుభ్రంగా ఉంచాలని, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని, విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపాలన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని తెలిపారు. బాలికా సాధికారత క్లబ్‌లలో గ్రీవెన్స్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఈవో రమేశ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్, సంక్షేమ పాఠశాలల అధికారి విక్రమ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉర్దూ జర్నలిస్టులు

ఉర్దూ జర్నలిస్టులకు అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పించాలని కోరుతూ టీయూడబ్ల్యూజేయూ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్టులు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ జమాల్ షరీఫ్ మాట్లాడుతూ అన్ని పత్రికల్లో మాదిరిగానే ఉర్దూ జర్నలిస్టులకు మండల స్థాయిలో కూడా అక్రిడేషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అబిద్ ఫైసల్, మహ్మద్ ఏజాజ్ ఉద్దీన్, జహీరుద్దీన్ అజీమ్, నూరుద్దీన్, సిరాజ్ పాల్గొన్నారు.

వైద్యరంగానికి పెద్దపీట

- రూ.45 కోట్లతో వంద పడకల ఆస్పత్రి మంజూరు
- నియోజకవర్గంలో మరో మూడు పీహెచ్‌సీల ఏర్పాటు
- రూ.750 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- లింగాలఘణపురం, చిలుపూర్ 108 సేవలు ప్రారంభం

లింగాలఘణపురం/చిలుపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తోందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాలఘణపురం, చిలుపూరు మండలాలకు ఒక్కో నూతన 108అంబులెన్స్ వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. గురువారం లింగాలఘణపురం మండల వాహనాన్ని లింగాలఘణపురంలో, చిలుపూరు మండలానికి చెందిన వాహనాన్ని మల్కాపూర్‌లో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. లింగాలఘణపురంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 681 మంది మెడికల్ ఆఫీసర్లను రిక్రూట్ చేసిందన్నారు.



మల్కాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

కొత్తగా మెడికల్ ఆఫీసర్ పోస్టుల్లో జిల్లాకు 18వచ్చాయని, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి 5 పోస్టులు వచ్చాయన్నారు. నియోజకవర్గం కోసం సీఎం రూ.45 కోట్లతో వంద పడకల ఆస్పత్రిని మంజూరు చేశారన్నారు. జిల్లాలో ఇప్పటికే 9 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయని, అదనంగా కంచనపల్లి, చిల్పూరు, పెద్దపెండ్యాలల్లో కొత్తగా పీహెచ్‌సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్, అడిషనల్ కలెక్టర్ రోహిత్‌సింగ్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ కొల్లూరి శివకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ, పీఏసీఎస్ చైర్మన్లు బుషిగంపల ఉపేందర్, మల్ల శ్రీశైలం, జీడికల్ దేవస్థానం చైర్మన్ ఏలె మూర్తి, పాల్గొన్నారు.



లింగాలఘణపురంలో జెండా ఊపి సేవలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్కాపూర్‌లో...

చిలుపూర్ మండలం మల్కాపూర్‌లో 108 వాహనాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో రూ.750 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వంద పడకల ఆస్పత్రి, డివిజనల్ కార్యాలయాల నిర్మాణ సముదాయం, డిగ్రీ కళాశాల తదితర అభివృద్ధి పనులు మంజూరయ్యాయన్నారు. చిలుపూర్ మండల కేంద్రంలో మరో పీహెచ్‌సీ మంజూరైందని, త్వరలోనే పనులను ప్రారంభమవుతాయన్నారు. మల్కాపూర్ పీహెచ్‌సీలో వైద్యులు 24 గంటలు సేవలందించేలా సంబంధిత శాఖ కమిషనర్‌తో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ సరస్వతి, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, బెలిదె వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్య -శిరీష్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, పసుల వెంకటేశ్, ఊరడి సతీష్, నామాల మల్లేష్, మామిడాల లింగారెడ్డి, బొమ్మిశెట్టి బాలరాజు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం: ఎమ్మెల్యే


దేవరుప్పుల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం సీఎం కప్ ముగింపు సమావేశం శ్రీసాయి ప్రశాంతి విద్యానికేతన్‌లో జరుగగా ఎమ్మెల్యేతోపాటు పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ షీల్డ్‌లు బహూకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే వ్యాయామం చేసినట్టు కూడా అవుతుందన్నారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా పోటీ పడాల్సిన అవసరం ఉందన్నారు. పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పలు రకాల క్రీడల్లో పాల్గొని 72మంది బాలబాలికలు జిల్లా స్థాయికి ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంఈవో కళావతి, ఎంపీవో సురేష్, తస్మా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, విజయ డైరీ జిల్లా చైర్మెన్ కాసారపు ధర్మారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు తోటకూరి పాండు కృష్ణ, బోనగిరి యాకస్వామి, పులిగిళ్ల వెంకన్న పాల్గొన్నారు.



క్రీడాకారులకు షీల్డ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే

‘భద్రకాళి’ అభివృద్ధికి ప్రత్యేక కమిటీ

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి చెరువులో పనులు పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నడుంబిగించింది. రెండు రోజుల క్రితం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డితో కుడా, బల్దియా, ఇరిగేషన్, భూగర్భ శాఖ అధికారులతో హైదరాబాద్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. పూడికతీత పనులపై దిశా నిర్దేశం చేశారు. ఎలాంటి ఆటంకం, ఆరోపణలు కాకుండా, సీసీ కెమెరాల పర్యవేక్షణలో పనులు నిర్వహించాలని సూచించారు. పూడికతీత మట్టి ఎన్ని ట్రిప్పులు, ఎక్కడికి తరలిస్తున్నారో రికార్డు చేయాలని చెప్పినట్టు తెలిపారు.



హైదరాబాద్ సమీక్షలో సూచనల మేరకు హనుమకొండ కలెక్టరేట్‌లో ఇద్దరు కలెక్టర్లు, బల్దియా కమిషనర్‌తో కలిసి గురువారం సమీక్ష నిర్వహించారు. భద్రకాళి చెరువు అభివృద్ధితోపాటు నీటిని నింపి ప్రజలకు సౌకర్యార్థంగా ఉండేందుకు సంబంధిత శాఖలు ఒక కమిటీగా ఏర్పడాలని కలెక్టర్లు సూచించారు. ఈ కమిటీని ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో పది ప్రభుత్వ శాఖ సమన్వయంలో ఏర్పాటు చేయాలని సూచించారు. కాగా, 15 రోజుల్లో పూడికతీత పనులు ప్రారంభం అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

క్రైం కార్నర్

అకౌంట్ల నుంచి డబ్బులు మాయం

రూ.1.15 లక్షలు పోగొట్టుకున్న బ్యాంకు ఉద్యోగి

పాలకుర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో పని చేస్తున్న ఉద్యోగి అకౌంట్ల నుంచి రూ.1.15లక్షలు సైబర్ నేరగాళ్లు మాయం చేసిన ఘటన పాలకుర్తి మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం. కొండాపురం శివారు మేకలతండాకు చెందిన లాకావత్ ప్రతాప్ పాలకుర్తిలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో పని (మెసెంజర్) చేస్తున్నాడు. ప్రతాప్‌కు మూడు ఆ బ్యాంకులో అకౌంట్లు ఉన్నాయి. వారం రోజుల క్రితం అదే బ్యాంకులో గోల్డ్‌లోన్ తీసుకోగా రూ. 3.50లక్షలు జమ అయ్యాయి. అందులోంచి రూ.2.50లక్షలు వారం రోజుల క్రితం డ్రా చేసుకున్నాడు. మంగళవారం రాత్రి తన మొబైల్ బ్యాలెన్స్‌ను చూసుకోగా డబ్బులు లేకపోయే సరికి ఆందోళన చెందాడు. ఒక అకౌంటులో రూ.వెయ్యి అకౌంటులో రూ.14 వేలు, మరో అకౌంటులో రూ. లక్ష మాయమయ్యాయి. దాంతో బ్యాంక్ వెళ్లి పరిశీలించగా, ఖాతాల్లో డబ్బుల లేవని చెప్పడంతో, ఎవరిఖాతాలోకి వెళ్లాయో కూడా తెలియకపోవడంతో లబోదిబోమన్నాడు. ఎలాంటి ఓటీపీ కూడా రాలేదని వాపోయాడు. దాంతో తాను మోసపోయినట్టు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

తుడుందెబ్బ జాతీయ నాయకుడు యాసం రాజు

వెంకటాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలు, హక్కులను అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తుడుందెబ్బ జాతీయ నాయకుడు యాసం రాజు అన్నారు. గురువారం మండలంలోని పాత్రాపురంలో చింత సోమరాజు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు కొన్ని సంవత్సరాలుగా ఆదివాసీ హక్కులు, చట్టాల కోసం త్యాగాలుచేసి సాధించు కున్న వాటిని అమలుచేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని, ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తుడుందెబ్బ మండల కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు పొదెం రత్నం, వీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఎన్నికలకు కసరత్తు

రఘునాథపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 36 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతోపాటు వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మండల అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 36గ్రామ పంచాయతీల పరిధిలో 44,605 మంది ఓటర్లు ఉన్నారని, 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే 13 లోపు తెలపాలని సూచించారు. 17న తుది పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తామని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఇందుకు సహకరించాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : స్థానిక ఎన్నికల కోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు మండలంలోని రాజకీయ నాయకులతో గురువారం ఎంపీడీవో నాగశేషాద్రిసూరి సమావేశమయ్యారు. మండలంలో పెరిగిన పోలింగ్ బూత్‌ల సంఖ్య, పోలింగ్ బూత్‌లపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 14 లోగా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొడకండ్లలో నాయకులతో సమావేశమైన అధికారులు

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గుగులోత్ నర్సింహా కుమారుడు బిక్షన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాళులర్పించారు. గురువారం పెద్దతండా చేరుకుని బిక్షన్ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు. అలాగే రంబోజీగూడెం ఎర్రకుంట తండాకు చెందిన రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జీసీసీ మాజీ చైర్మన్ గాంధీ నాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, నాయకులు రాంసింగ్, కొల్లూరి సోమయ్య, కోక్యానాయక్, భగవాన్, భాషా, వసిందర్, హేమ, చిన్న, నర్సింహా, రామల్, మోహన్, మంగు, నరేందర్, బిచ్చా, రాజన్న, భద్రు, రాజు, దిలీప్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న దయాకర్‌రావు

కళాక్షేత్రం పగుళ్లపై విచారణ జరిపించాలి

- కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి
- బీజేపీ, కేయూ విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్
- చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం





కాళోజీ కళాక్షేత్రంలో పగుళ్లను పరిశీలిస్తున్న కుడా అధికారులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రూ.కోట్లు వెచ్చించి.. నగరం నడిబొడ్డున ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన కథనం తీవ్ర చర్చనీయాంశమయ్యింది. బీజేపీ నాయకులు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కళాక్షేత్రాన్ని పరిశీలించేందుకు వెళ్లగా అక్కడి సెక్యూరిటీ సిబ్బంది గేటుకు తాళం వేసి ఉంచడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రావుల కిషన్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించి నెలరోజులు కాకముందే పగుళ్లు ఏర్పడటంపై కలెక్టర్ విచారణ జరిపించాలని, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కళాక్షేత్రం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ లేదని, అందువల్లే గోడలకు పగుళ్లు వచ్చాయని ఆరోపించారు. ఇక 'ఆంధ్రజ్యోతి' కథనంతో అప్రమత్తమైన కుడా అధికారులు కళాక్షేత్రం గోడలకు వచ్చిన పగుళ్లను పరిశీలించారు. ఇవి చిన్న చిన్న లోపాలని, ఇలాంటివి సహజంగానే జరుగుతాయని, దీన్ని పెద్దదిగా చేయడం సరికాదన్నారు. వెంటనే పగుళ్లకు మరమ్మతులు చేయిస్తామని అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే సుమారు రూ.95కోట్లు వెచ్చించి నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం విషయంలో నాణ్యత పాటించకపోవడమేంటన్న చర్చ సర్వత్రా జరిగింది.

అవి పగుళ్లు కాదు : జీడబ్ల్యూఎంసీ కమిషనర్

కాళోజీ కళాక్షేత్రం భవనం గోడలకు వచ్చినవి పగుళ్లు కాదని, ఎలివేషన్‌లోని రెండు జీఎఫ్ఆర్సీ పలకల మధ్య గ్యాప్ వచ్చిందని గ్రేటర్ వరంగల్ కమిషనర్, కుడా వైస్‌చైర్మన్ అశ్వినితానాజీ వాకడే బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాళోజీ కళాక్షేత్రం గోడలకు పగుళ్లు వచ్చిన అంశంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆమె స్పందిస్తూ ఓ ప్రకటన చేశారు.

కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలి

మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 40 శాతం డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమాన్ని ఈనెల 14న జిల్లాలోని 125 విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులతో సమావేశమై మాట్లాడారు. డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరై హాస్టళ్లు, పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేస్తారని చెప్పారు. అందుకు అనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ముందస్తు ఆహ్వానాలు పంపించాలని, విద్యా సంస్థల ఆవరణలో శానిటేషన్ చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాణ్యమైన ఆహార పదార్థాలతో రుచికరమైన భోజనం సిద్ధం చేయాలని సూచించారు.

ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించి, పిల్లలకు నాణ్యమైన ఆహారం అందిస్తూ ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన అందించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలో ప్రతీ హాస్టల్‌కు ఒక అధికారిని నియమించి, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రణాళిక ప్రకారం విద్యార్థుల స్థితిగతులను తెలుసుకుంటూ అందిస్తున్న సౌకర్యాలను తనిఖీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె. వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులు పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, నర్సింహాస్వామి, సైదానాయక్, సుబ్బారావు, శ్రీనివాస్, హరిప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి శంకర్

వెంకటాపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అటవీ ప్రాంతంలో ఎవరైనా వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ములుగు ఫారెస్ట్ రేంజ్ అధికారి డోలి శంకర్ హెచ్చరించారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలోని బండ్లపహాడ్‌లో గురువారం ఆయన అటవీశాఖ సిబ్బందితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా 31 గొత్తికోయ నివాసాలను తనిఖీ చేసి అటవీ జంతువులను వేటాడే ఉచ్చులు, బాణాలు, చువ్వలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. అటవీ ప్రాణులను వేటాడడం నేరమని, అనుమానితులు ఎవరైనా అడవిలో సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని, ఇందుకు బహుమతులు అందజేస్తామని తెలిపారు. కలప అక్రమ రవాణా, ఇసుక రవాణా సమాచారం అందజేయాలని సూచించారు. కాగా, ములుగు జిల్లాలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవు తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి యాకూబ్‌జాని, సెక్షన్ అధికారి రవీందర్, బీట్ అధికారులు రాజేశ్వరి, సుప్రియ, స్వర్ణలత, రూప్‌కుమార్, శివశంకర్, భద్రు, రాజేష్, హనుమంతు, శ్యామ్‌సుందర్, బేస్‌క్యాంప్ సిబ్బంది తదితరు లు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బాణాలను చూపుతున్న రేంజ్ అధికారి శంకర్

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2315	2080
పల్లికాయ (సూక)	4020	4000
పల్లికాయ (పచ్చిది)	4250	5500
కందులు	-	-
పెసళ్లు	6812	6000
పత్తి	7100	5800
పసుపు (కాడి)	11111	11000
పసుపు (గోల)	11209	10500
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి (కొత్తది)	16000	12000
తేజ ఏసీ	15500	14000
వండర్ హాట్ ఏసీ	13000	11000
యూఎస్ 341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం



కృష్ణవేణిని సన్మానిస్తున్న జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

పారా త్రోబాల్ క్రీడాకారిణి మాచర్ల కృష్ణవేణికి సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామస్థురాలు మాచర్ల కృష్ణవేణి డిసెంబరు 5, 6, 7న కాంబోడియా దేశంలో జరిగిన ఇంటర్నేషనల్ సిట్టింగ్ పారా త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి భారతదేశానికి గోల్డ్‌మెడల్ తీసుకువచ్చింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం కలెక్టర్ కార్యాలయంలో కృష్ణవేణికి స్వీట్స్ తినిపించి శాలువాతో సత్కరించారు. జనగామ జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం సంతోషకరమైన విషయమని, ఇంటర్నేషనల్ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి దేశానికి, జిల్లాకు పేరు తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు. రానున్న రోజుల్లో పారా ఒలంపిక్స్ పోటీలకు ఎంపికయ్యేలా సాధన చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, జిల్లా క్రీడల విభాగం అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సభ్యత్వాల సర్టిఫికెట్ల అందజేత



రెడ్‌క్రాస్ శాశ్వత సభ్యత్వ సర్టిఫికెట్లు అందజేస్తున్న చైర్మన్ వరప్రసాద్

తొర్రూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖలో 2017-18 నుంచి శాశ్వత సభ్యులుగా చేరి సేవా కార్యక్రమాలు అందిస్తున్న వారికి సర్టిఫికెట్‌లను అందిస్తున్నట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ శాఖ చైర్మన్ పి.వరప్రసాద్ తెలిపారు. గురువారం తొర్రూరులోని లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగిన సమావేశంలో సర్టిఫికెట్‌లు అందజేసి ఆయన మాట్లాడారు. ఇండియాలోని అన్ని నగరాల్లో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అందిస్తుందని, పేద ప్రజల సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్యాట్రన్ సభ్యులు డాక్టర్ కె.రాజేందర్ రెడ్డి, టి.విశ్వేశ్వరరావు, యాదగిరి రెడ్డి, వీరభద్ర రావు, జి. వెంకన్న, సరేష్, రేగూరి వెంకన్న, డాక్టర్ రాం నర్సయ్య, కిరణ్‌కుమార్ ఉన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు



కేంద్ర మంత్రి జువల్‌ని సన్మానిస్తున్న హుస్సేన్‌నాయక్

మహబూబాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : న్యూఢిల్లీలో కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరంను జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి జువల్ ఓరంకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా హుస్సేన్‌నాయక్ మాట్లాడుతూ వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో విద్యనభ్యసించే విద్యార్థులకు 500 మంది సామర్థ్యం గల వసతి గృహం అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. వసతిగృహ భవన నిర్మాణం కోసం రూ.20 కోట్లు అవసరం ఉంటుందని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం భీమునిపాదం జలపాతంను పర్యాటక కేంద్రంగా చేసేందుకు, గిరిజన యువత ఉపాధికోర్తై సుమారు రూ.13 కోట్లతో అటవీశాఖ అధికారులతో ప్రణాళిక రూపొందించామని మంత్రికి వివరించినట్లు చెప్పారు. తద్వారా ఆప్రాంత గిరిజనులకు ఉపాధి లభించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి కేంద్ర ప్రభుత్వం ద్వారా సత్వర సహకారం అందించనున్నట్లు వివరించారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి పీహెచ్‌డీ పరిశోధన విద్యార్థులకు ప్రతీ సంవత్సరం ఇచ్చే రూ.750 ఉపకార వేతనాల కోసం అనేక మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని హుస్సేన్‌నాయక్ కేంద్రమంతికి విజ్ఞప్తి చేశారు.



రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మానవ హక్కుల సంఘం సభ్యులు

వైబ్రెంట్ విద్యా సంస్థల అధినేత రాజేందర్‌రెడ్డికి సన్మానం

హనుమకొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా తన బోధనల ద్వారా విద్యాసంస్థలలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన వైబ్రెంట్ విద్యాసంస్థల అధినేత చిట్టిరెడ్డి రాజేందర్‌రెడ్డి సేవలను గుర్తించి మానవహక్కుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. హనుమకొండలోని రాయల్ ఫంక్షన్ గార్డెన్‌లో రాజేందర్‌రెడ్డి దంపతులకు శాలువా కప్పి భారత సేవారత్న బిరుదును బహూకరించి ఘనంగా సన్మానించారు. రాజేందర్‌రెడ్డి 2019లో మహిళా డిగ్రీ కళాశాలను స్థాపించి ఎంతోమంది పేద విద్యార్థులకు సేవ చేసినట్లు తెలిపారు. ఆయన సేవలను గుర్తించి సన్మానం చేసినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజు (ఫైల్)

సంగెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గవిచర్ల గ్రామంలో జరిగిన పెళ్లిలో పాల్గొని తిరిగి స్వగ్రామం వెళుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడి యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంగెం పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన నీరటి రాజు, గుండా సురేష్, కుక్కల పవన్‌లు ఈనెల 7న గవిచర్ల గ్రామంలో జరిగే పెళ్లికి బైక్‌పై ముగ్గురు వచ్చి తిరిగి స్వగ్రామం వెళుతున్నారు. అదే రోజు రాత్రి 11 గంటలకు వెళుతుండగా మండలంలోని ఆశాలపల్లి- కాపులకనపర్తి గ్రామాల మధ్యన గల ఓ రైస్‌మిల్లు వద్ద అదుపు తప్పి కిందపడ్డారు. వాహనం నడుపుతున్న నీరటి రాజు(23)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎంకు తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతుడు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు ఎస్సై చెప్పాడు.

యువకుడు ఆత్మహత్య



భరత్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని నందినగర్ కాలనీలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నందినగర్‌కు చెందిన భట్టు సుజాత-రమేష్ దంపతులకు ముగ్గురు కుమారుల్లో రెండోవాడు భరత్ (25) జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో కుక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొన్ని నెలలుగా అస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. బాధను భరించలేక నాలుగు రోజుల క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. జిల్లా ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. భరత్ మృతి చెందాడు. మృతుడికి తల్లి సుజాత, ఇద్దరు సోదరులు ఉన్నారు.

నలుగురు కలెక్టర్లకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లింపులో జాప్యంపై వివరణ ఇవ్వాలని నాలుగు జిల్లాల కలెక్టర్‌లకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ విషయంలో ఎందుకు కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించింది. ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై గతేడాది విచారణ జరిగింది. ఇది పరిశీలనలో ఉందని, నాలుగు నెలల్లో చెల్లిస్తామని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది.

ఏడాది దాటినా పరిహారం చెల్లించకపోవడంపై కొండల్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. యాదాద్రి భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్‌లకు నోటీసులు జారీచేసింది. కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను ఎందుకు స్వీకరించరాదో వివరణ ఇవ్వాలని పేర్కొంది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా పడింది.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

నెహ్రూసెంటర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రముఖ పర్యాటక కేంద్రాలైన కాశీవిశ్వనాథ్, విశాలక్ష్మి అన్నపూర్ణదేవి, శ్రీరామజన్మభూమి, హనుమాన్‌గరి అయోధ్యలో జరిగే కుంభమేళాకు దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లను కేటాయించినట్లు టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగార్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 19న ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్ మీదుగా సాయంత్రం 4 గంటలకు మహబూబాబాద్ స్టేషన్‌కు చేరుకుంటున్నట్లు చెప్పారు. డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ మీదుగా టూరిజం ప్రాంతాలకు వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ ప్రత్యేక రైలులో ప్రయాణికులకు సౌకర్యార్థంగా ప్రత్యేక గదులు, ఏసీ, నాన్ ఏసీ సౌకర్యాలతోపాటు క్యాటరింగ్ సౌకర్యం ఉంటుందన్నారు. ప్రతీ 75 మందికి టీం లీడర్‌లు మేనేజ్‌మెంట్ చేస్తారని చెప్పారు. పూర్తి సమాచారం కోసం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ http://www.irctctourism.comను సంప్రదించాలన్నారు. పూర్తి వివరాల కోసం సెల్ : 971260701, 9287030711లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఇన్‌చార్జి నరేష్, టూరిజం మెంబర్ ప్రశాంత్ పాల్గొన్నారు.



మానుకోటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టూరిజం ఎగ్జిక్యూటివ్ పవన్ సెంగార్



పులి మడుగు

ప్రకృతి సోయగం

గూడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎత్తైన కొండలు.. అరుదైన వృక్షాలు.. అబ్బురపరిచే జలపాతం.. పచ్చని ప్రకృతి అందాలతో ఎంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి చారిత్రక పులిమడుగు గుట్టలు. ఒకప్పుడు పులులకు ఆవాసంగా ఉండే ఈ ప్రాంతంలో ఇప్పుడు పలు వన్యప్రాణులున్నాయి. ఎలుగుబంట్లు, జింకలు, కనుజు, మూషికజింక, చుక్కల దుప్పులు, కుందేళ్లు, అడవి పందులు, నెమళ్లు, ఇతరత్ర వన్యప్రాణులతో పాటు పశుపక్ష్యాదులు, ఔషధ గుణాలు కలిగిన చెట్లు ఇక్కడి ప్రత్యేకం. మహబూబాబాద్ జిల్లాలో 1.50లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న పులి మడుగు ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని గత ప్రభుత్వంలో అధికారులు ప్రతిపాదనలు చేశారు. తాజాగా, ప్రకృతి పర్యాటక కేంద్రంగా సర్కార్ గుర్తించడంతో పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందబోతోందని అధికారులు చెకబుతుండగా.. పర్యాటకులను ఆకర్షించేలా సఫారీ, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్, బోటింగ్, ఉండడానికి వసతి సౌకర్యాలను కల్పిస్తే బావుంటుందని ప్రకృతి ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

12 ప్రకృతి సర్క్యూట్లలో ఒకటి..

పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిసారించింది. రాష్ట్రంలో అటవీ, అటవీ ఇతర ప్రాంతాలు కలిపి మొత్తం 12 సర్క్యూట్‌లను అధికారులు గుర్తించారు.

వీటిలో భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్ పరిధిలోని మహబూబాబాద్ జిల్లా గూ డూరు రేంజ్ పరిధిలోని పులిమడుగు అటవీప్రాంతాన్ని చేర్చారు. పులిమడుగు ప్రాంతం వన్యప్రాణుల ఆవా సానికి అనువుగా ఉంటుంది. ఇక్కడి దట్టమైన అడవిలో నీటి వనరులు పుష్కలంగా ఉండటం, విశాలమైన గడ్డి మైదానాలు, రాళ్ల గుట్టలు, గూహలు వాటి ఆవాసానికి అనుకూలంగా ఉంటాయి.

పులిమడుగులో క్యాంపెయిన్ సైట్..

గూడూరు, గంగారం, కొత్తగూడ, బయ్యారం సరిహద్దుల్లో ఉన్న ఈ పులిమడుగులో అటవీశాఖ ఆధ్వర్యంలో రూ.18 లక్షల నిధులతో క్యాంపెయిన్ సైట్, సోలార్ బోరు, నీటి కుంటలను ఏర్పాటు చేశారు.

గూడూరు రేంజ్ పరిధిలోని మట్టేవాడ శివారు కొంగరిగిద్ద నుంచి కొడిశలమిట్ట సమీపంలో పులిమడుగు ప్రాంతం ఉంది. అక్కడి వరకు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రం నుంచి పులిమడుగుకు చేరుకోవాలంటే కేవలం 40 కిలోమీటర్లు ఉంటుంది. హనుమకొండ, గూడూరు మీదుగా పులిమడుగు వరకు సుమారు 100 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇప్పటికే అరకొరగా ఉన్న సౌకర్యాలతోనే పర్యాటకులు వచ్చి సందడి చేస్తున్నారు. కొంగరిగిద్ద నుంచి పులి మడుగు వరకు రోడ్డు సౌకర్యం, సఫారి, బర్డ్‌వాచ్, ట్రెక్కింగ్ బోటింగ్ లాంటి సౌకర్యాలు కల్పిస్తే పులి మడుగుకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుం చే కాకుండా ఖమ్మం, హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం నుంచి పర్యాటకులు వస్తారని, తద్వారా అటవీశాఖకు, ప్రభు త్వానికి ఆదాయం సమకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పులిమడుగు పర్యాటక కేంద్ర అభివృద్ధి కోసం గతంలో కంప అడిషనల్ పీసీసీఎఫ్ సువర్ణ, అడిషనల్ పీసీసీఎస్ ఫర్గీన్, భద్రాద్రి కొత్తగూడెం సీసీఎఫ్ భీమా నాయక్, అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ శశాంక, డీఎఫ్‌వో రవికిరణ్, ప్రస్తుత డీఎఫ్‌వో బత్తుల విశాల్, గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌రావు, వరంగల్ డీఎఫ్‌వో అపర్ణలు సందర్శించారు. పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

- విశాలమైన అడవులకు నెలవు
- వన్యప్రాణుల మనుగడకు అనువైన ప్రాంతం
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న ప్రకృతి అందాలు
- అభివృద్ధి చేస్తే మరింత ఆదరణ


పులి మడుగులో బోటింగ్ చేస్తున్న అటవీ శాఖాధికారులు


పులిమడుగులో క్యాంపెయినింగ్ సైట్‌ను ప్రారంభిస్తున్న అటవీశాఖ ఉన్నతాధికారులు (ఫైల్)


పులిమడుగులో పర్యటిస్తున్న అటవీశాఖ అధికారులు

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి
మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు, గూడూరు



గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలో ఉన్న పులిమడుగు అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి. కొంగరిగిద్ద నుంచి పులిమడుగు వరకు రహదారిని ఏర్పాటు చేయాలి. పర్యాటకులకు ట్రెక్కింగ్, బర్డ్‌వాచ్, సఫారీ, బోటింగ్, వసతి సౌకర్యం కల్పించాలి. పులిమడుగులో పర్యాటకుల సందడి పెరిగితే అటవీశాఖకు అదాయం సమకూరనుంది.

పులిమడుగు జీవ వైవిధ్యానికి కేంద్రం
ఎఫ్ఆర్వో , మహబూబాబాద్ జిల్లా



పులిమడుగులోని పచ్చని వాతావరణం సకల ప్రాణుల ఆవాసానికి అనుకూలంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో నీటిఊటలు, వాగులు, వంకలు, అరుదైన వృక్షశిలాజాలు ఉన్నాయి. ఇది శాకాహార జంతువులతో పాటు క్రూర జంతువులకు కూడా ఆవాసంగా ఉంది. పులిమడుగును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఇప్పటికే పులిమడుగులో క్యాంపెయిన్ సైట్, నీటికుంటలు, సోలార్ బోర్‌ను ఏర్పాటు చేశాం.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్ మెడికల్, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): కేరళలో నిర్వహించిన రీజినల్ స్థాయి హెచ్‌ఐవీ, ఎయిడ్స్ క్విజ్ పో టీలలో హనుమకొండ జిల్లా విద్యార్థులు తృతీయ బహుమతి సాధించారు. ఈ కాంపిటీషన్‌లో విద్యార్థులు విధాత్రి, ఖలీముల్లా బహుమతిలో భాగంగా రూ.20వేల నగదు, ప్రశంసా పత్రం అందుకున్నారు. విజేతలను, తోడ్పాటు అందించిన మేనేజర్ స్వప్న మాధురిలను హనుమకొండ డీఎంహెచ్ఓ ఏ.అప్పయ్య, అదనపు డీఎంహెచ్ఓ మదన్‌మోహన్‌రావు అభినందించారు.


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు


ములుగురోడ్‌లోని సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువుదీరిన దత్తాత్రేయుడు

గురువులకే గురువు.. గురుదత్తుడు

- 15న దత్త జయంతి.. వేడుకలకు దత్తక్షేత్రంలో ఏర్పాట్లు
- పౌర్ణమి హోమం, అన్నప్రసాద వితరణ
- భక్తులతో 54 సార్లు దత్తస్థవ పారాయణం

ఆధ్యాత్మికం

వరంగల్ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆది గురువు గురువులకే గురువు.. అత్రి అనసూయ మాతల పుత్రుడు దత్తాత్రేయుడు. యోగా మూర్తిగా నిరంతరం భక్తులను అనుగ్రహించే దత్తుడి జయంతి రోజైన ఈ నెల 15న వరంగల్ ఉమ్మడి జిల్లాలో దత్తాల యాల్లో, సాయిబాబా దేవాలయాల్లో గురు పరంపరల ఆశ్రమాలలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్గశిర మాసం కృత్తికా నక్షత్రం పౌర్ణమి రోజున దత్తాత్రేయ స్వామి జన్మదినం సందర్భంగా స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు, హోమాలు, అలంకరణలు, భజనలు, హారతులు, అన్నదానాలు నిర్వహించడానికి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.

తైలంతో అభిషేకం విశేష ఫలం

దత్తాత్రేయ స్వామికి నువ్వుల నూనెతో అభిషేకం నిర్వహిస్తే విశేష అనుగ్రహం కలుగుతుందని, మంచి జరగడం కోసం, అనారోగ్యాల బారి నుంచి కాపాడుకోవడం కోసం పౌర్ణమి రోజున నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ తైలంతో దత్తాత్రేయ స్వామికి అభిషేకం చేయాలని, దాంతో విశేషఫలం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. దత్తా.. దత్తా.. అని స్మరణ చేస్తే సంతుష్టుడయ్యే మూర్తి గా దత్తాత్రేయుడిని ఆరాధిస్తారు. స్వామికి భజనలు, నామస్మ రణలంటే ప్రీతి. గురు పరంపరలో ఆది గురువుగా ప్రసిద్ధికెక్కిన అవదూతగా దత్తాత్రేయస్వామిని గురువుగా కొలుస్తారు.

దత్తక్షేత్రంలో వేడుకలు

రాష్ట్రంలోనే స్థిరమూర్తిగా కూర్చొని ఉన్న దత్తాత్రేయస్వామి ములుగురోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో కొలువు దీరాడు. ఏటా దత్తజయంతి రోజున ఇక్కడ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం 15న ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో తైలాభిషేకాలు, హోమంతో పాటు 54 సార్లు శ్రీదత్తస్థవ పారాయణంనిర్వహిస్తారు. మహా అన్నప్రసాద వితరణను కూడా ఏర్పాటు చేశారు. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని సాయిబాబా దేవాలయాలు, గురు ఆశ్రమాల్లో 15న దత్త జయంతి వేడుకలు, హారతులు, అన్నదానం, హోమాలు, అభిషేకాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

నారుమడికి జెండా అండ



పక్షుల నుంచి నారుమడిని కాపాడుకునేందుకు పార్టీ జెండాలను ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నాడు ఓ రైతు. కేసముద్రం మండలంలోని తాళ్లపూస పల్లి శివారులో మహబూబాబాద్ వెళ్లే రహదారి వెంట ఓ నారుమడికి నాలుగువైపులా కాంగ్రెస్ పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడో రైతు. స్వతహాగా కాంగ్రెస్ అభిమాని అయిన సదరు రైతు.. తనకే కాదు నారుమడికి కూడా అభయ 'హస్తం' అన్నట్టుగా పార్టీ జెండాలను ఏర్పాటు చేశాడంటూ దారినపోయేవారు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

\- కేసముద్రం, ఆంధ్రజ్యోతి

బహుముఖ ప్రజ్ఞాశాలి.. వలస పైడి



మన టీవీ, యూ ట్యూబ్‌లో పాఠాలు బోధిస్తున్న పైడి

- వ్యాఖ్యాతగా, కవిగా రాణిస్తున్న ఉపాధ్యాయుడు
- అర్ధాంగి జ్ఞాపకాలతో 'మాఇంటి బతుకమ్మ' పుస్తక ప్రచురణ
- విద్యాశాఖ, పలు ప్రభుత్వ కార్యక్రమాలకూ సమన్వయకర్త

కీర్తి పతాక

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆయన భావిపౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు. సమాజాన్ని నిర్దేశించే సామాజిక సాహితీవేత్త. టీచర్ వృత్తిలో కొనసాగుతూనే దూరదర్శన్ విద్యా సంబంధ కార్యక్రమాలు, ఆకాశవాణిలో పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా, సాహితీ కార్యక్రమాలకు సమన్వయకర్తగా, నాటకాల్లో పాత్రధారిగా, కవిగా, రచయితగా బహుముఖ రంగాల్లో ప్రతిభను చాటుతున్నారు. ఆయనే హనుమకొండ జిల్లా కేంద్రంలోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వలస పైడి. కరోనా సమయంలో పైడి పేరుతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించి 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు 72 పాఠాలను రూపొందించి బోధించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల పక్కనున్న శ్రీరాములపల్లిలో వలస ఉప్పలయ్య, కట్టమ్మ దంపతులకు జన్మించిన పైడి అక్కడి ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, అంబాల జడ్పీహెచ్ఎస్‌లో 6 నుంచి టెన్త్ వరకు పూర్తి చేశారు. ఆరో తరగతిలోనే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న పైడి.. శ్రీరాముల పల్లిలోని భజన మండలి ప్రదర్శించే నాటకాలకు సాహిత్యం అందించారు. అంతేకా దు ఆరో తరగతిలోనే లవకుశ నాటకంలో రైతు పాత్ర వేశారు. వరంగల్‌లోని విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల, కడప జిల్లా లోని ప్రొద్దుటూర్‌లో ఉపాధ్యాయ పండిత శిక్షణ అనంతరం 1996లో వరంగల్ మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు.

11 పుస్తకాల రచన

వలస పైడి వ్యాఖ్యాతగానే కాకుండా కవి, రచయిత గాను ఖ్యాతిగడిస్తు న్నాడు. సామా జిక స్పృహ కలిగిన కవిగా రాణిస్తూ 11 పుస్తకాలను ఆయన రచించారు. తన అర్ధాంగి సునీత మరణించగా ఆమె గుర్తులను 'మా ఇంటి బతుకమ్మ'గా పదిలపరుచుకున్నారు. 'ఆచార్య దేవోభవ' పేరుతో 5 బాలల నాటికలను పుస్తకంగా రచించారు. 'మా పల్లె పచ్చబడ్డది' అనే సైన్స్ నేపథ్యంతో ఉన్న నాటికి రాష్ట్ర స్థాయిలో ప్రదర్శింపబడింది. 'ఆకురా లిన వసంతం' అనే పరిశోధానత్మక పుస్తకంతో పాటు 'మా నాయిన' అనే గేయ కవిత్వం, 'కొత్త పొద్దు', 'తెలంగాణ జయ కేతనం' పేరుతో తెలంగాణ ఆవిర్భావం సందర్భం పై పుస్తకాలు రాశారు. ఇలా సాహిత్యంలోని అన్ని కోణాలను స్పృశిస్తూ రచనలు చేస్తున్నారు.

విద్యా శాఖ కార్యక్రమాలకు ఆయనే వ్యాఖ్యాత

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా వ్యాఖ్యాతగా వలస పైడి ఉండాల్సిందే అంటే అతిశయోక్తి కాదు. 1997లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో వ్యాఖ్యాతగా అరంగేట్రం చేసిన పైడి వేలాది కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

టీశాట్ (మన టీవి)లో లైవ్ లెసన్ ప్రజెంటర్‌గా పనిచేశారు. ఇవే కాకుండా ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి కాకతీయ ఉత్సవాలు, ఓరుగల్లు కళావైభవాలు కార్యక్రమాలకు వ్యాఖ్యానం అందించారు. జిల్లాలో నిర్వహించే వివిధ సాహి తీ సమ్మేళనాలు, పుస్తకావిష్కరణలు, ఉగాది పండుగ వేళ దూరదర్శన్‌లో నిర్వహించే కవి సమ్మేళనానికి, వేయి స్తంభాల గుడిలో నిర్వహించే కవి సమ్మేళనాలకు వలస పైడియే వ్యాఖ్యాతగా ఉంటారు.

వరంగల్ ఆకాశవాణిలో డాక్టర్ అంపశయ్య నవీన్ రాసిన బాంధవ్యాలు అనే నాటికను 18 ధారావాహికాల్లో ఆయా పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి వ్యాఖ్యానం చేశారు. అలాగే 42 ధారావాహికాల్లో 101 బాలల కోసం భారత కథలు వ్యాఖ్యానం చేశారు. అలాగే అనేక నాటకాల్లో వివిధ పాత్రలకు ఆయన ప్రాణం పోశారు.

సీఎంలు, మంత్రుల కార్యక్రమాలకు..

జిల్లాకు వచ్చే ముఖ్యమంత్రులు, మంత్రుల కార్యక్రమాలకు పైడినే అధికారులు వ్యాఖ్యాతగా ఎంచుకుంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ములుగు రాయినిగూడెంలో నిర్వహించిన కార్యక్రమానికి వ్యాఖ్యానం చేశారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన హయాంలో నర్సంపేటలో నిర్వహించిన గ్రామజ్యోతి కార్యక్రమానికి పైడీనే వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అవార్డులెన్నో...

2017లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సత్కారం పొందారు. రెండు సార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గౌరవాన్ని దక్కించుకున్నారు. ఢిల్లీలో దళిత సాహిత్య అకాడమీ వారి ఉత్తమ కవిగా అవార్డు అందుకున్నారు. లయన్స్, రోటరీ క్లబ్‌ల నేషనల్ బిల్డర్ అవార్డు పొందడంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల నుంచి వలస పైడి అనేక మార్లు సత్కారాలు అందుకున్నారు.


అప్పటి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు తీసుకుంటున్న పైడి

ఎల్డర్ లైన్ 14567

- ఆదరణకు నోచుకోని వృద్ధుల కోసం ఫోన్‌నెంబర్
- తక్షణమే సాయం అందించేలా ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- రెవెన్యూ డివిజన్లు, జిల్లాల స్థాయిలో ప్రత్యేక ట్రిబ్యునళ్లు
- వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలుకు విభాగం ఏర్పాటు

మీ కోసం

బాలసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతిలో కుటుంబంలోని పెద్దల పట్ల ఎంతో గౌరవం ఉండేది. కానీ సామాజికంగా, ఆర్థికంగా వస్తున్న మార్పుల కారణంగా ఆ గౌరవం సన్నగిల్లుతోంది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై కుటుంబం అంటే భార్యా, భర్త, పిల్లలు మాత్రమే అనే పరిస్థితి వచ్చింది. చివరకు తమను పెంచిపెద్ద చేసిన.. ప్రయోజకులను చేసిన అత్తా,మామ, తల్లిదండ్రులకు వారింట్లో స్థానంలేకుండా పోయింది. ఫలితంగా ఆ తల్లిదండ్రులు చరమాంకంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. నేటి సమాజంలో చాలా మంది వయోవృద్ధులు తమ పిల్లల నుంచి సరైన ఆదరణకు నోచుకోక.. ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం, దూషణలు, ఎన్నో అవమానాలు భరిస్తూ బతుకుతున్నారు. ఇక జీవిత భాగస్వామిని కోల్పోయిన, సంతానం లేని వృద్ధుల పరిస్థితి అయితే ఇంకా దారుణంగా ఉంటోంది. అలాంటి వృద్ధుల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. చట్టాలను అమలు చేస్తున్నాయి. రాజ్యాంగంలో వయో వృద్ధులకు కూడా ప్రాథమిక హక్కులున్నాయి. హిందూ దత్తత పోషణ చట్టం ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత సంతానంపైనే ఉంటుంది. అంతేగాక తల్లిదండ్రులు తమను తాము పోషించుకోలేని స్థితిలో పిల్లల నిరాదరణకు గురైనప్పుడు చట్టం ద్వారా ప్రభుత్వం వారి పోషణకు అయ్యే ఖర్చులను పిల్లల నుంచి ఇప్పిస్తోంది.



వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రభుత్వ శాఖ

చట్టంపై అవగాహన లేకపోవడం, చట్టం నిబంధనల గురించి తెలియకపోవడంతో వయో వృద్ధులు ఎన్నోసమస్యలతో నిస్సహాయంగా బాధపడుతున్నారు. 2007లో రూపొందించిన తల్లిదండ్రులు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2011లో నియమావళి రూపొంది అములులోకి వచ్చింది. చట్టాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేసింది. వయో వృద్ధుల వ్యధను తీర్చేందుకు, గౌరవంగా జీవించేందుకు అవసరమైన ప్రభుత్వ పథకాలను, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ఆ విభాగం ప్రధాన కర్తవ్యం. మారుమూల పల్లెల్లో నివసిస్తున్న వయో వృద్ధులకు చట్టం గురించి తగు అవగాహన కల్పించి అవసరమైన సౌకర్యాలు కల్పించే బాధ్యత అధికారులపై ఉంటుంది.

ఎల్డర్ లైన్, ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు

నిర్లక్ష్యానికి గురైన వయోవృద్ధుల పరిస్థితులను చక్క దిద్దేందుకు వారికి అవసరమైన సామాజిక భద్రత, ఆరోగ్య పరిరక్షణ, సురక్షితమైన ఆశ్రయం, బలవర్థకమైన ఆహారం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆసరా పింఛన్, ఆరోగ్య శ్రీ లాంటి పథకాలను అమలు చేస్తోంది. బాధితులైన వయో వృద్ధులకు త్వరితగతిన న్యాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రెవెన్యూ డివిజన్లలో ట్రిబ్యూనళ్లను, జిల్లా స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యూనళ్లను ఏర్పాటు చేసింది. అంతేగాక బాధిత వృద్ధులకు సత్వరం సులభంగా సహాయం అందించడానికి ప్రత్యేకమైన ఉచిత సహాయక ఫోన్ నంబర్ 14567 (ఎల్డర్‌లైన్)ను ఏర్పాటు చేసింది. సాధారణంగా తల్లిదండ్రులు వృద్ధాప్య దశకు చేరుకున్నాక తమ పేరున ఉన్న స్థిరాస్తులను తమ పిల్లల పేరున మార్పిడి చేస్తారు. ఆస్తి మార్పిడి అయ్యాక కొంత కాలానికి పిల్లలు తమ తల్లిదండ్రుల పోషణ, బాగోగులను పట్టించుకోకుండా నిర్ధయగా ప్రవర్తిస్తే విధిలేని పరిస్థితుల్లో వారు ప్రభుత్వ సహాయాన్ని కోరవచ్చు. ఎల్డర్‌లైన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించినా లేదా సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారిని కలిసి సమస్యను విన్నవించుకున్నా పరిష్కరించి తగిన న్యాయం చేస్తారు. పిల్లల పేరున బదిలీ చేసిన ఆస్తిని తిరిగి తల్లిదండ్రుల పేరున మార్పిడి చేస్తారు. ఇది ఆస్తిని అనుభవించే వారసులందరికీ చట్టం వర్తిస్తోంది.

వృద్ధుల సంక్షేమం కోసం సంఘం ..

వయో వృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగానే కాకుండా స్వచ్ఛందంగా సేవలందించేందుకు సామాజిక స్పృహకలిగిన పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ముందుకొచ్చారు. రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య అధ్యక్షుడిగా.. తేరాల యుగందర్ ప్రధాన కార్యదర్శిగా సుమారు 100 మంది రిటైర్డ్ ఉద్యోగులు కలిసి హనుమకొండ జిల్లా వయో వృద్ధుల సంక్షేమ సంఘాన్ని ఏర్పాటు చేశారు. తమవంతు కర్తవ్యంగా నగరంలోని రోడ్లవెంట చలిలో వణుకుతున్న అనా థ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ సహకారంతో కంటి చికిత్స శిబిరాలు, డీఎంహెచ్‌వో, ఆయుష్ డిపార్ట్‌మెంట్ సహకారం తో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వరంగల్‌లోని ఎంజీఎం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చే వృద్ధులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయాలం టూ సంక్షేమ సంఘం నాయకులు చేసిన కృషి ఫలితంగానే ప్రత్యేక ఓపీ ని ఏర్పాటు చేశారు. అంతేగాక సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్‌కు వచ్చే వృద్ధుల సౌకర్యార్థం చట్టపరంగా ప్రతీ పోలీసు స్టేషన్‌లో వృద్ధ మిత్ర కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవిస్తున్నారు.

వృద్ధులు పనికిరాని వారు కాదు..



వృద్ధులను పనికి రాని వారుగా పరిగణించవద్దు. జీవితంలో వారు గడించిన అనుభవాలు ఎన్నో ఉంటాయి. అంతేగాక జ్ఞాన సంపన్నులై ఉంటారు. సమాజం వారి సేవలను ఉపయోగించుకోవాలి. రిటైర్ అయిన ఉద్యోగులంతా తమ ఉన్నతికి అవకాశం కల్పించిన సమాజ అభివృద్ధి, సంక్షేమం కోసం శాయశక్తుల కృషి చేయాలి.

దామెర నర్సయ్య, రిటైర్డ్ డీఎస్పీ, వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యూస్ బాక్స్



డ్రైవర్లకు ప్రమాదబీమా కార్డులు అందజేస్తున్న రాజుగౌడ్

డ్రైవర్లకు ప్రమాద బీమా

బచ్చన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కట్కూరులో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు మాజీ సర్పంచ్ ముసిని సునీతరాజుగౌడ్‌లు ఒక్కొక్కరికి రూ.10లక్షల ప్రమాదబీమా చేయించారు. ఇందుకు సంబంధించిన కార్డులు గురువారం అందించారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు యువకులు, వాహనదారులు ప్రమాదాల్లో చనిపోగా, వారికి బీమా సౌకర్యం లేకపోవటంతో కుటుంబాలు వీధిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో డ్రైవర్‌లకు అండగా నిలవాలని పోస్టాఫీస్ ద్వారా ఇన్సూరెన్స్ చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముసిని శ్రీశైలంగౌడ్, అశోక్, ఎల్లయ్యగౌడ్, శ్రీనివాస్, రాజు, ప్రశాంత్, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న సరిత

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

బచ్చన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సరిత అన్నారు. గురువారం బచ్చన్నపేటలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి సిబ్బంది వెళ్లాలన్నారు. ఇంటికి సంబంధించిన వివరాలు పూర్తిగా సేకరించాలన్నారు. ప్రస్తుతం ఉంటున్న ఇంటికి సంబంధించిన వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని, ప్రతిరోజు 50 ఇళ్ల వరకు సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో సూపరింటిండెంట్ శ్రీనాథ్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటచారి, రేవతిగౌడ్, కవిత రుబీనా, రూపచైతన్య, భాను, ప్రశాంత్ పాల్గొన్నారు.



క్రాంతికుమార్‌ను కలిసిన యూత్ నాయకులు

క్రాంతిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చిలుపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బోనాసి క్రాంతికుమార్‌ను మండల యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై యూత్ కాంగ్రెస్ ప్రతినిధులు చేపడుతున్న ప్రచారాన్ని ఆయనకు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల యూత్ అధ్యక్షులు ఇల్లందుల విజయ్, ఇనురం కృష్ణ, ఐలపాక మనోజ్, గొల్లపల్లి వాసు, నీల కరుణాకర్ పాల్గొన్నారు.



చెత్తశుద్ధి ఏదీ?

జనగామ జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద చెత్తా చెదారం పేరుకుపోయి, అపరిశుభ్రంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నెహ్రూ పార్కు నుంచి బాణాపురం, రైల్వే స్టేషన్‌కు వెళ్లాలంటే ప్రజలు సర్వీసు రోడ్డు ద్వారానే వెళ్లాలి. సీపీఐ పార్టీ కార్యాలయం నుంచి రైల్వే అండర్ పాస్ వరకు సర్వీసు రోడ్డు లేకపోవడంతో ప్రయాణికులు వన్‌వే ద్వారా పోతుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారుతోంది. నెహ్రూ పార్కు చౌరస్తా నుంచి బీరప్ప గడ్డకు వెళ్లే రోడ్డు వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా సర్వీసు రోడ్డు వేసిన అధికారులు అక్కడి నుంచి అండర్‌పాస్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణం చేయలేదు. మిగిలి ఉన్న ఖాళీ స్థలంలో చెత్తా చెదారం వేస్తుండడంతో అది పందులు, కుక్కలు, దోమలకు నిలయంగా మారింది. అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి దుర్గంధంతో అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-జనగామ రూరల్(ఆంధ్రజ్యోతి)



కార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్‌రావు

పల్లగుట్ట శివాలయానికి మరమ్మతులు

చిలుపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పల్లగుట్టలో శిథిలావస్థకు చేరిన శివాలయానికి కాంగ్రెస్ నాయకుడు, చిలుపూర్ గుట్ట ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు మరమ్మతు పనులను ప్రారంభించారు. గురువారం పూజారులు కేశోజు నిరంజన్‌చారి, ఎనమల వెంకటస్వామిల సమక్షంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ పురాతన ఆలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. రూ.2 లక్షలతో పనులను త్వరలోనే పూర్తి చేయాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, చల్లారపు శ్యామ్, బత్తిని శ్రీను, వేల్పుల గట్టయ్య పాల్గొన్నారు.

కష్టపడే వారికి తగిన ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

దేవరుప్పుల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందని పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం కోలుకొండ, దేవునిగుట్టతండా, పొట్టిగుట్టతండా గ్రామ పంచాయతీల్లో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఝాన్సీరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కష్టపడ్డట్టుగా రానున్న స్థానిక సంస్థ ఎన్నికల కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, నాయకులు తోటకూరి పాండు కృష్ణ, రెడ్డి రాజుల రమేష్, ఓడపెల్లి రవీందర్, కాడబోయిన గణేష్ పాల్గొన్నారు.

కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలి

రఘునాథపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కోకాపేటలో తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కురుమ సంఘం నూతన భవన ప్రారంభోత్సవం 14న జరుగుతున్నందున, కురుమలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను మండల కేంద్రంలో కురుమ సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు పేర్నె రవి, ద్యావర యాకయ్య, గొరిగె భాస్కర్, మాశ్ల యాకయ్య, గొరిగె రవి, బర్మ సత్తయ్య వెంకన్న, రాజు, భరత్, శ్రీను, భిక్షపతి, మల్లయ్య, బీరయ్య, శ్రీనివాస్, మహేందర్, అనిల్ పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించాలి

జనగామ రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్, మురికి కాల్వలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ అధికారులను కోరారు. జనగామలోని సంజయ్‌నగర్‌లో కొడిజాల అంజమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రకాశ్ మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. ఫుట్‌పాత్, మురికి కాలువలపై అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో వర్షం కాలంలో రోడ్డుపైనే వరద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అధికారులు వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్యాణం లింగం, సౌందర్య, పద్మ, లక్ష్మి, అనిత యాదలక్ష్మి పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంక్



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న బీఎం స్రవంతి

జఫర్‌గడ్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు(ఏపీజీవీబీ)లు.. కొత్త సంవత్సరం (జనవరి1) నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులుగా మార్పు చెందబోతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటైన ఈ బ్యాంకులు, తెలంగాణ ఏర్పడినా ఇదే పేరుతో కొనసాగుతున్నాయి. ఒక రాష్ట్రానికి ఒక గ్రామీణ బ్యాంకు ఉండాలని ఇటీవల కేంద్రం తీసుకున్న నిర్ణయం మేరకు.. ఏపీజీవీ బ్యాంకు పేరును.. 2025, జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు చేయడం జరుగుతోందని జఫర్‌గడ్ ఏపీజీవీబి మేనేజర్ పి.స్రవంతి తెలిపారు. గురువారం బ్యాంకు ప్రతినిధులతో కలిసి ఆమె మండల కేంద్రంలోని సెంటర్‌లో బ్యాంకు పేరు మార్పిడి ప్రచార వాల్‌పోస్టర్లను గ్రామస్థుల సమక్షంలో ఆవిష్కరించారు. స్రవంతి మాట్లాడుతూ 28 నుంచి 31 తేదీ వరకు బ్యాంకు శాఖలో బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు అందుబాటులో ఉండబోవన్నారు.

సీపీఐ వార్షికోత్సవాన్ని సక్సెస్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఐ వార్షికోత్సవాలు విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 99 ఏళ్లుగా పేద ప్రజల పక్షాన సుదీర్ఘ పోరాటాలు చేస్తున్న సీపీఐ పీడిత ప్రజల పక్షపాతన్నారు. దేశంలో 400 సీట్లతో అధికారంలోకి వస్తామని ప్రగల్బాలు పలికిన బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పారన్నారు. ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, నితీష్‌మార్‌ల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతున్నదని ఆరోపించారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎమ్డీ రహ్మతుల్లా, యూనస్, సముద్రాల రాజు, ఆశీర్వాదం, యాదగిరి, నాగరాజు, పృథ్వీరాజ్, పి.సాయిలు, కె.రంజిత్, ఎల్లయ్య పాల్గొన్నారు.

22న కాకతీ కదనభేరిని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న స్థితప్రజ్ఞ

జనగామ కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ 22న వరంగల్‌లో నిర్వహించే 'కాకతీ కదనభేరి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ కోరారు. గురువారం జనగామ మండలం చౌడారం మోడల్ స్కూల్‌లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్‌తో కలిసి భోజన విరామ సమయంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. స్థితప్రజ్ఞ మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గం యూపీఎస్ విధానానికి ఆమోదం తెలిపిందని అందుకు నిరసనగా వరంగల్‌లోని ఇస్లామియా గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి, లింగమూర్తి, మల్లికార్జున్, మనోజ్‌కుమార్, జీవన్‌కుమార్, దిల్షాద్, వీరభద్రం, నిఖిల్, శ్యాంసుందర్, శ్రీహరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చిలుపూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీపతిపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రంగు మల్లయ్య (76) కుటుంబాన్ని బీఆర్ఎస్ ఇన్‌చార్జి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యతోపాటు, చిలుపూర్ గుట్ట ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, నాయకులు వేర్వేరుగా పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లా రాజ మహేందర్‌రెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, కొయ్యడ రాందాస్, బొమ్మిశెట్టి బాలరాజు, పసుల వెంకటేశ్, ఎస్.మల్లేష్, ఊరడి సతీష్ పాల్గొన్నారు.

- కొడకండ్ల: హక్యాతండా గ్రామపంచాయతీ పరిధిలోని మంగ్యాతండాకు చెందిన గుగులోత్ శ్రీను బుధవారం కరెంట్‌షాక్‌తో మృతిచెందగా, గురువారం బీఆర్ఎస్ నాయకులు మండలపార్టీ అధ్యక్షుడు సింధె రామోజీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి పార్టీ అండదండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పేరం రాము, మేటి సోమరాములు, దేశగాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ మార్పు తగదు



తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే దురుద్దేశంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం హేయమైన చర్యని మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఆరోపించారు. ఈమేరకు ఘన్‌పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి రాజయ్య నాయకులతో కలిసి పుష్పాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు పవిత్రంగా భావించే బతుకమ్మ లేకుండా విగ్రహం రూపొందించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాది కావస్తున్న ఎమ్మెల్యే కడియం నియోజకవర్గంలో ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల కృషితో గెలిచిన కడియంకు ప్రజాస్వామ్యం పైన, రాజ్యాంగం పైన గౌరవం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా కాంగ్రెస్ పార్టీ గుర్తు పైన గెలువాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, కనకం గణేష్, లకావత్ చిరంజీవి, టి.సురేష్, నాగపూరి పావని, గుండె మల్లేశం, గాదె రాజు, అకారపు అశోక్, బంగ్లా శ్రీనివాస్, గుర్రం శంకర్, దేవయ్య, ఏసుబాబు, రంజిత్ పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలి



కమిటీతో ప్రతినిధులతో రాజశేఖర్, కిషోర్

జఫర్‌గడ్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పైస రాజశేఖర్, గద్దల కిషోర్ డిమాండ్ చేశారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా గురువారం జఫర్‌గడ్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ మండల స్థాయి సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా.. అమలులో జాప్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వర్గీకరణ లేకుండా ఉద్యోగాలను భర్తీ చేయడమనేది.. ఎస్సీలలోని 58 ఉప కులాలకు అన్యాయం చేయడమేనన్నారు. సమావేశంలో ఎంఎస్పీ జిల్లా ప్రతినిధి రవిందర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సింగపురం ఉదయ్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు సంపత్, సమ్మయ్య, మధు, ప్రణయ్, నరేష్, ప్రదీప్, అభిషేక్, సన్నీ, ఎడ్ల శ్రీను, చిన్న, తూళ్ల కుమార్, సలీం పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక..

సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గాదెపాక మహేందర్, ప్రధాన కార్యదర్శిగా దాట్ల అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడుగా దాట్ల శోభన్, గొట్టె శంకర్, మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడిగా ఇల్లందుల బాబు, ఉపాధ్యక్షులుగా ఇల్లందుల యాకనాథం, ఇల్లందుల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా జోగు రత్నం, కార్యదర్శిగా రడపాక యాదగిరిని ఎన్నుకున్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్‌కు నివాళి



రమేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిటీ

రఘునాథపల్లి, డిసెంబరు 12(ఆంధ్ర జ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాదె రమేష్ దశదిన కర్మ సందర్భంగా మండలంలోని ఖిలాషాపూర్‌లో మార్కెట్ కమిటీ పాలకవర్గంతోపాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు గురువారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, వైస్ చైర్మన్ కె.నర్సింహులు, డైరెక్టర్లు ఎండి.బాషమియా, తోటకూరి రమేష్, బందకుమార్, శ్రీలత రెడ్డి, శ్రీనివాస్, నర్సింగరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవిగౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభ





వడ్లకొండ పాఠశాలలో గౌరగల్ల ప్రీతితో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, పెంబర్తిలో సింధును అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఇన్‌స్పైర్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సన్మానం

జనగామ కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల జనగామలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్‌లో పెంబర్తి జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్న ఎ.సింధు నాచురల్ ఫార్మింగ్ అంశంపై జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.నాగరాణి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ సీహెచ్.రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్లకొండ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన గౌరగల్ల ప్రీతి వ్యవసాయ క్షేత్రాల వద్ద కరంటు మోటార్లు ఆన్‌చేసే సమయంలో జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి స్టార్టర్‌ను ముట్టుకోకుండానే ఆన్‌చేసే పరికరాన్ని తయారుచేసి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.

కాగా పాఠశాల హెచ్‌ఎం స్వర్గం ప్రకాశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక

కొడకండ్ల డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో టీజీఆర్ఎస్ విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లాస్థాయి టెస్ట్‌లో పాల్గొనడానికి అర్హత సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలస్థాయి టెస్ట్‌లో పి.మోక్షజ్ఞ ప్రథమ స్థానం, బి.నాగవైష్ణవి ద్వితీయ స్థానం పొందారని తెలిపారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

బచ్చన్నపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం బయాలాజికల్ సైన్స్ ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదిరెడ్డి అకాడమీ చైర్మన్ నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయాలజీ టెస్ట్‌కు శివునిపల్లి విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శివునిపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మండల స్థాయి బయాలజీ సబ్జెక్టు టెస్ట్‌లో రాణించారు. జి.మేఘన, ఎల్.అనిల్ తెలుగు మీడియం నుంచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఇంగ్లీష్ మీడియం నుంచి అక్షర (ఘన్‌పూర్ హైస్కూల్), సింధు(ఘన్‌పూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్) ఎంపికయ్యారని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, బయాలజీ ఉపాధ్యాయులు ఎం.వసంతకుమారి, నళినీబాయి, జలజ, ఝాన్సీ తదితరులను హెచ్‌ఎంలు ఎం.సంపత్, కె.రమేశ్, ఉపాధ్యాయులు ఎం.యాదగిరి, కె.కృష్ణవేణి, శ్రీకాంత్, రవి కుమార్, జి.రవి అభినందించారు.



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శాస్త్రీయ విద్యతోనే సమాజాభివృద్ధి



పాలకుర్తిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం రమేష్

పాలకుర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు శాస్త్రీయ భావాలను ఆచరించడంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో మండల స్థాయి జీవ శాస్త్రం ప్రతిభా పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 15 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. గూడూరు జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు మహాకర్, ఎం.శ్రీజలు ప్రతిభ కనబరచడంతో జిల్లా స్థాయిలో జరిగే ప్రతిభ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలైన విద్యార్థులు మధూకర్, శ్రీజలకు బహుమతులు అందచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్నవజ్జుల నర్సింహమూర్తి, గోపాల్, జయశ్రీ, కొండయ్య, రమేష్‌బాబు, వరలక్ష్మీ, బాబయ్య, నవందకుమార్ ఉన్నారు.